సాక్షి పెద్దపల్లి

సోమవారం । 22 । మే । 2023



శ్రీవారి ఆలయ నిర్మాణానికి శ్రీకారం

వేదమంత్రోచ్ఛరణల మధ్య దేవదేవునికి నిర్వహించే అనిర్వచనీయమైన నిత్య కైంకర్య వైభోగాన్ని కరీంనగర్‌లో త్వరలోనే ప్రత్యక్షంగా వీక్షించనున్నారు. 8లో▸



గీత కార్మికులకు బీమా భరోసా

గీత కార్మికులకు బీమా పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో పరిహారం కోసం కార్యాలయాలు, నాయకుల ఇళ్లచుట్టూ తిరగాల్సి వచ్చేది. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.0 /28.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

- నేటి నుంచి వచ్చేనెల పదో తేదీ వరకు
- ఏర్పాట్లు చేసిన జిల్లా విద్యాశాఖ



కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం

సుల్తానాబాద్‌: ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీలో ఉత్తీర్ణత సాధించేలా వారికి సోమవారం నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కేజీబీవీ విద్యార్థులకు సుల్తానాబాద్‌ మండలం భూపతిపూర్‌ హైస్కూల్‌లో.. మోడల్‌ కళాశాల విద్యార్థులకు వారివారి కళాశాలల్లోనే విద్యాబోధన చేయనున్నారు. అడ్వాన్స్‌ సప్లిమెంటరీపై కలెక్టర్‌ సంగీత ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు తీసుకోవాలని సూచించినట్లు డీఈవో మాధవి తెలిపారు. కేజీబీవీ విద్యార్థులు 136 మందికి భూపతిపూర్‌ పాఠశాలలో ప్రత్యేక తరగతుల కోసం ఏర్పాట్లు చేశారు. వీరికి రెసిడెన్షియల్‌ పద్ధతిన వసతులు కల్పించనున్నారు. మోడల్‌ కళాశాలలకు చెందిన 715 మందికి వారివారి కళాశాలల్లోనే తరగతులు బోధించనున్నారు. వీరికి ఎలాంటి భోజన వసతి ఉండదు. జూన్‌ పదో తేదీ వరకు వీరిని పరీక్షలకు సిద్ధం చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశామని డీఈవో మాధవి స్పష్టం చేశారు.

ప్లాస్టిక్‌ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి



పనులు పరిశీలిస్తున్న డీపీవో

జూలపల్లి: గ్రామీణ ప్రాంతాలను ప్లాస్టిక్‌రహితంగా తీర్చిదిద్దడంలో కార్మికుల కృషి ముఖ్యమని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి అన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలకేంద్రంలో పారిశుద్ధ్య పనులు, చెత్త తొలగింపును పర్యవేక్షించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో కార్మికులకు ప్లాస్టిక్‌ వ్యర్థాలతో తయారు చేసిన టైల్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో వేణుగోపాలరావు, కార్యదర్శి లచ్చయ్య ఉన్నారు.

కార్పొరేట్‌ ఇంటర్‌ కాలేజీలో ప్రవేశాలకు ఆహ్వానం

పెద్దపల్లిరూరల్‌: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి 7.0 జీపీఏ సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, వికలాంగ విద్యార్థులు కార్పొరేట్‌ ఇంటర్‌ కాలేజీల్లో చేరేందుకు సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధి అధికారి నాగలేశ్వర్‌ తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశం పొందేందుకు జూన్‌ 3లోగా ఆన్‌లైన్‌ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మెరిట్‌ ప్రకారం సీజీజీ ఆన్‌లైన్‌ ఆటోమెటిక్‌ సిస్టమ్‌ ద్వారా విద్యార్థులను హైదరాబాద్‌లో ఎంపిక చేస్తారని, అర్హత, ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి జిల్లాస్థాయి సీఎం కప్‌పోటీలు

పెద్దపల్లిరూరల్‌: సీఎం కప్‌ జిల్లాస్థాయి క్రీడా పోటీలు సోమవారం ప్రారంభంకానున్నాయి. గోదావరిఖనిలోని జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియంలో నిర్వహించే ఈ పోటీలు ఈనెల 24వరకు సాగుతాయి. మండలస్థాయిలో విజేతలుగా నిలిచిన 800 మంది క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని యువజన క్రీడలశాఖ ఇన్‌చార్జి అధికారి తిరుపతిరావు తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 7గంటల నుంచి 11 వరకు, సాయంత్రం 4గంటల నుంచి 8వరకుపోటీలు నిర్వహిస్తామన్నారు.

నేడు జరిగే పోటీలు

- సోమవారం ఉదయం కబడ్డీ, ఫుట్‌బాల్, వాలీబాల్, సాయంత్రం బ్యాడ్మింటన్.
- 23న: ఉదయం ఖోఖో, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, రెజ్లింగ్, బ్యాడ్మింటన్.
- 24న: ఉదయం బ్యాడ్మింటన్, బాక్సింగ్‌ పోటీలు నిర్వహించిన అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని అధికారులు వివరించారు.



మురుగునీరు పొంగిపొర్లుతున్న ఈ చిత్రం గోదావరిఖని ఇందిరానగర్‌ కల్లు డిపో ముందు మ్యాన్‌హోల్‌. ఈనెల 19 నుంచి 8రోజులపాటు స్పెషల్‌ శానిటేషన్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నట్లు నగర మేయర్‌ అనిల్‌ కుమార్‌ ప్రకటించారు. కానీ.. ఈ ఫొటోలోని దృశ్యం చూస్తే మాత్రం అధికారుల మొక్కుబడి పనితనాన్ని అంచనా వేయొచ్చు. నివాసాల సమీపంలోనే మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. పందులు మురుగు నీటిలో స్వైర విహారం చేస్తున్నాయి. మరో 15 రోజుల్లో వర్షాలు ప్రారంభమవుతాయని తెలిసినా అధికారులు చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

గోదావరిఖని మార్కండేయ కాలనీలో బోర్లా పడిఉన్న ఈ డబ్బాలను కంపాక్టర్‌ బిన్స్‌ అంటారు. ఒక్కో బిన్‌ ధర రు.30వేలు. రోడ్డుపై చెత్త పడేయకుండా ఈ డబ్బాల్లోనే పడేయాలనే లక్ష్యంతో నగరంలోని 50 డివిజన్లలో ఏర్పాటు చేశారు. వీటిపై పర్యవేక్షణ లేకపోవడంతో చాలా డబ్బాల వీల్స్‌ విరిగిపోయాయి. కొన్ని డబ్బాలను బోర్లా పడేశారు. ఫలితంగా చెత్తను స్థానికులు డబ్బాల పక్కన రోడ్డుపై పడేస్తున్నారు. ఇదీ రామగుండం కార్పొరేషన్‌ అధికారుల చిత్తశుద్ధి.



స్వచ్ఛతలో వెనుకంజ

- మెరుగుపడని పారిశుద్ధ్యం
- స్వచ్ఛసర్వేక్షణ్‌ పోటీల్లో ఆశించని ర్యాంకులు

- మొక్కుబడిగా పాలకవర్గం చొరవ
- గాడి తప్పుతున్న సేవలు
- చక్కదిద్దితేనే మెరుగైన ర్యాంకు సాధ్యం



రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ స్వచ్ఛ సర్వేక్షణ్‌ పోటీలో వెనుకబడుతోంది. పురపాలక, నగరపాలక సంస్థల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చడానికి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్‌ పేరుతో పోటీలు నిర్వహిస్తోంది. ఈ పోటీల్లో 2017 నుంచి తలపడుతున్న రామగుండం నగరపాలక సంస్థ మాత్రం ఆశించిన స్థాయిలో ర్యాంకు సాధించలేకపోతోంది. పాలకులు, అధికారులు పట్టించుకోకపోడంతోనే పారిశుధ్యం మెరుగవ్వడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఏడాది కూడా పోటీలో నిలిచిన రామగుండం బల్దియా మెరుగైన ర్యాంక్‌ సాధించాలంటే పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని నగర ప్రజలు కోరుతున్నారు. వచ్చేనెల ఢిల్లీ నుంచి స్వచ్ఛసర్వేక్షణ్‌ బృందం రామగుండం బల్దియాలో పరిశీలనకు రానున్న నేపథ్యంలో అధికారులు మేల్కొనాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రశ్నార్థకంగా ర్యాంకుల సాధన

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రామగుండం బల్దియాకు ర్యాంకుల సాధన ప్రశ్నార్థకంగా మారింది. బహిరంగ మలవిసర్జన రహితం(ఓడీఎఫ్), చెత్త రహిత ప్రాంతం(జీఎఫ్‌సి)తో పాటు నీటి నిర్వహణ మార్కులు కీలకంగా ఉన్నాయి. మురుగు నీటి శుద్ధి నిర్వహణ వ్యవస్థ లేకపోవడంతో ఓడీఎఫ్‌ ప్లస్‌ తోనే ఇప్పటివరకు సరిపెట్టుకుంటున్నారు. దీనికి తోడు ఏ డివిజన్‌లో చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. ఫలితంగా జీఎఫ్‌సీ సర్టిఫికెట్‌ రావడం లేదు. బల్దియా నగరపాలక వర్గం, అధికారులు ఇప్పటికైనా మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు సాధించే అవకాశముంది. లేకుంటే గతంలో తరహా మిగితా నగరపాలక సంస్థల కంటే వెనకంజలో ఉండాల్సి వస్తుంది.

వచ్చే నెలలో క్యూసీఐ బృందం రాక

రామగుండంలో పారిశుద్ధ్యం పనితీరును తనిఖీ చేయడానికి వచ్చే నెలలో ఢిల్లీ నుంచి క్వాలిటీ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియా (క్యూసీఐ) ప్రతినిధులు రానున్నారు. క్షేత్రస్థాయిలో మురుగు నీటి శుద్ధి, సులభ్‌ కాంప్లెక్స్‌ల నిర్వహణ, తడి, పొడి చెత్త ప్రక్రియ, ఎరువుల తయారీ, డంపింగ్‌ యార్డ్‌ తీరు, తాగునీటి సరఫరా, బహిరంగ మలవిసర్జన రహితం కోసం చేపట్టిన చర్యలు, అధికారులు సమర్పించిన నివేదికలను తనిఖీ చేసి, ప్రజల అభిప్రాయాలను సేకరించనున్నారు.

సమష్టి కృషితోనే ఫలితం

రామగుండంలో పాలకులు, అధికారుల మధ్య సమన్వయం కొరవడింది. స్వచ్ఛసర్వేక్షణ్‌లో పాలకులు మొక్కుబడిగా పాల్గొంటున్నారు. సమష్టితో కృషి చేస్తే, బల్దియాకు మంచి ర్యాంకు రావడంతోపాటు నగరం అభివృద్ధి బాటలో పయనిస్తుందని ప్రజలు కోరుకుంటున్నారు.

బల్దియా శానిటేషన్‌ ప్రొఫైల్‌

- విస్తీర్ణం: 93.87(చదరపు కిలోమీటర్లు)
- ప్రతిరోజూ వెలువడే చెత్త: 115 మెట్రిక్‌ టన్నులు
- మొత్తం డివిజన్లు: 50
- మురికివాడలు: 92
- జనాభా : 2,29,644 (2011జనాభా లెక్కల ప్రకారం)
- నివాసాలు: 63,000
- మొత్తం పారిశుధ్య కార్మికులు: 448

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఇప్పటివరకు వచ్చిన ర్యాంకు

2022	2020	2018
136	211	194
2021	2019	2017
92	192	191

కాగితాల్లోనే తడి, పొడి చెత్త ప్రక్రియ

తడి, పొడి చెత్త వేరు చేసే ప్రక్రియ రామగుండంలో కాగితాలకే పరిమితం అవుతోంది. స్వచ్ఛ సర్వేక్షణ్‌ తడి, పొడి చెత్త నిర్వహణతోపాటు బహిరంగ మల, మూత్ర విసర్జన, మురుగు నిర్వహణ కూడా కీలకం. కేవలం పొడి చెత్త నిర్వహణ చేపడుతున్న అధికారులు.. తడి చెత్తపై చేతులెత్తేశారు. తడి చెత్తతో కంపోస్టు ఎరువు తయారు చేయడానికి అవసరమైన అన్ని వనరులు ఉన్నప్పటికీ ఆ దిశగా అడుగులు మాత్రం ముందుకుపడటం లేదు. తడి చెత్తతో ఎరువులను తయారు చేసి నర్సరీలకు వాడుతున్నట్లు తప్పుడు నివేదికలు తయారు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారీ చేసేందుకు గౌతమినగర్, ఎన్టీఆర్‌నగర్, జ్యోతినగర్‌లో షెడ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ వినియోగానికి నోచుకోలేదు. రెండేళ్ల క్రితం ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాంతాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించారు. సేంద్రియ ఎరువు తయారీ కేంద్రాలను నిర్వహించి కొంత ఫలితం సాధించారు. తర్వాత ఈ ప్రక్రియ నిర్వహణ గాడి తప్పింది.

నకిలీ విత్తనాలపై టాస్క్‌ఫోర్స్‌

గడిచిన మూడేళ్లలో నమోదైన కేసులు, పట్టుబడిన విత్తనాలు (టన్నుల్లో), విలువ (రూ.లక్షల్లో)

ఏడాది	కేసులు	నిందితులు	విత్తనాలు	విలువ
2021	65	158	5.08	95.92
2022	13	27	1.48	27.97
2023	02	09	1.31	26.20



తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు

- విత్తనాల శాంపిల్స్‌ వెంటనే పరీక్ష
- సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు
- మండలస్థాయి నుంచి ప్రత్యేక బృందాలు
- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి వెల్లడి

గోదావరిఖని: నకిలీ విత్తనాలపై పోలీస్‌శాఖ సీరియస్‌గా ముందుకు సాగుతోంది. నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపాలని సీఎం కేసీఆర్‌ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో రామగుండం పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ బృందాలను ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న క్రమంలో నకిలీవిత్తనాల విక్రయాలపై పోలీసులు దృష్టి సారించారు. వ్యవసాయ శాఖ, ఇంటలిజెన్స్‌ సిబ్బంది సమన్వయంతో ముందుకుసాగాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా రెండు జిల్లాల్లోని విత్తన, ఎరువుల దుకాణాలు, గోదాములను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానం వచ్చిన విత్తనాల శాంపిళ్లను సేకరించి వెంటనే పరీక్షలకు పంపించనున్నారు. విత్తనాల రవాణా వాహనాలనూ ఆకస్మికంగా తనిఖీలు చేయనున్నారు. లైసెన్స్‌ లేకుండా, నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కేసుల నమోదుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థల నుంచే విత్తనాలు కొనుగోలు చేసేలా ప్రతి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాల్లోకి రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

మండలస్థాయి నుంచే ప్రత్యేక బృందాలు

నకిలీ విత్తనాలను గుర్తించేందుకు వ్యవసాయశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పోలీసుల ద్వారా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. ముందుగా రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యమిస్తారు. విత్తనాలు విక్రయించే షాపులపై ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నారు. ఇలా హైదరాబాద్‌ స్థాయి ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతారు.

అక్రమ మద్యం రవాణాపై నజర్‌

అక్రమ మద్యం రవాణాపైనా పోలీసులు దృష్టి సారించారు. పోలీసు, ఎక్సైజ్, రైల్వే, రవాణా శాఖ సంయుక్త సమన్వయంతో ముందుకు సాగనున్నారు. జిల్లాల సరిహద్దుల్లో నిఘా ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అక్రమ రవాణాను జరిగే ప్రాంతాలు, మార్గాలను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాటు మొబైల్‌ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి మద్యం అక్రమ రవాణా అరికట్టేందుకు ఇన్‌ఫార్మర్‌ వ్యవస్థను పటిష్టం చేశారు. కమిషనరేట్‌ పరిధిలో నకిలీ విత్తనాల రవాణా, వ్యాపారం చేసే 18 మందిని గుర్తించి వారిపై పీడీయాక్టు అమలు చేశారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



నకిలీ విత్తనాలు సరఫరా చేసి రైతులను మోసం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. స్పెషల్‌ టాస్క్‌ఫోర్స్‌ బృందాలను ఏర్పాటు చేశాం. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమ రవాణాపై దృష్టి పెట్టాం. సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సీసీ కెమెరాల నిఘా కొనసాగుతుంది.

– రెమా రాజేశ్వరి, సీపీ

యువతను ప్రోత్సహించిన రాజీవ్‌గాంధీ



పూలమాలవేసి నివాళ్లర్పిస్తున్న రాజ్‌ఠాగూర్‌



రాజీవ్‌విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

- కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్‌.రాజ్‌ఠాగూర్‌

గోదావరిఖని: యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి రాజకీయాల్లో ప్రోత్సాహం అందించిన గొప్పనేత రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ రాజ్‌ఠాగూర్‌ అన్నారు. రాజీవ్‌ గాంధీ 32వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక జీఎంకాలనీలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఎలక్ట్రానిక్స్, ఐటీ కమ్యూనికేషన్‌ రంగాల్లో భారత్‌ను అభివృద్ధిలో పరుగులు పెట్టించారని గుర్తు చేశారు. అనేక రంగాల్లో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన గొప్ప నాయకుడని కొనియాడారు. అలాంటి నాయకుడిని స్మరించుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. మాదరబోయిన రవికుమార్, మహంకాళి స్వామి, ఎండీ.ముస్తఫా, పెద్దెల్లి ప్రకాష్, గట్ల రమేష్, బొంతల లచ్చన్న, రవియాదవ్, యుగేందర్, పంజా శ్రీను, తిప్పారపు శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

పాలకుర్తి: పేదల సంక్షేమానికి పనిచేసే పార్టీ కాంగ్రెస్‌ అని మక్కాన్‌సింగ్‌ రాజ్‌ఠాకూర్‌ అన్నారు. మండలంలోని వేంనూర్‌కు చెందిన గంగపుత్ర కులస్తులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం.. అన్నివర్గాలను మోసం చేస్తోందన్నారు. పార్టీ అధికారంలోకొస్తే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామన్నారు. నాయకులు శ్రీనివాస్, శంకరయ్య, సురేశ్, సుధాకర్, కృష్ణ పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళి..

పెద్దపల్లిరూరల్‌: రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్‌ నాయకులు అన్నారు. పెద్దపల్లిలోని జెండా కూడలిలో ఆదివారం రాజీవ్‌ వర్ధంతి కార్యక్రమాన్ని పార్టీ పట్టణ అధ్యక్షుడు సురేశ్‌గౌడ్‌ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బి.రమేశ్‌గౌడ్, జగదీశ్, అక్బర్‌అలీ, సంపత్, సుభాష్‌రావు, తులా మనోహర్‌రావు, తాడూరి శ్రీమాన్, వేముల రాజు, పూదరి చంద్రశేఖర్, సయ్యద్‌మస్రత్, బండారి సునిల్, శ్రీనివాస్, హకీం, మెహరాజ్, మసూద్, రవుఫ్‌ఖాన్‌ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చల్లంగాచూడు మల్లన్న





ఓదెల(పెద్దపల్లి): భక్తుల ఇలవేల్పు ఓదెల మల్లన్న సన్నిధిలో ఆదివారం రద్దీ నెలకొంది. ముందుగా భక్తులు స్నానాలు ఆచరించి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం విఘ్నేశ్వరుడు, మల్లికార్జునస్వామి, ఖండేలరాయుడు, సీతారామచంద్రస్వామి, నందీశ్వరులను దర్శించుకున్నారు. పూజారులు వితరణ చేసిన తీర్థప్రసాదములు స్వీకరించారు. ఇంటిల్లిపాదిని చల్లగా చూడాలని ఒగ్గు పూజారులచే స్వామివారి పేరిట పట్నాలతో పాటు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో సదయ్య, జూనియర్‌ అసిస్టెంట్‌ కుమారస్వామి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అర్థవంతమైన సినిమాలకే ఆదరణ

- కుటుంబకథను కళ్లకు కట్టారు
- 'పచ్చనికుటుంబం' షార్ట్‌ఫిలింకు ప్రశంసలు
- తెలంగాణ భాషా సంస్కృతి డైరెక్టర్‌ మామిడి హరికృష్ణ
- నిర్మాతతో సహా కళాకారులకు సత్కారం



మాట్లాడుతున్న చిత్రబృందం సభ్యులు

పెద్దపల్లిరూరల్‌: సమాజహితం, కుటుంబవ్యవస్థను బలోపేతం చేసేలా నిర్మించిన సినిమాలకు ఆదరణ లభిస్తుందని తెలంగాణ భాషా సంస్కృతిశాఖ డైరెక్టర్‌ మామిడి హరికృష్ణ అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సినీవారం పేరిట నిర్వహించే కార్యక్రమంలో పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌ గ్రామానికి చెందిన మర్కు లక్ష్మణ్‌ దర్శకత్వంలో రూపొందిన ×పచ్చనికుటుంబం× అనే లఘుచిత్రాన్ని ప్రదర్శించారు. ఈ చిత్రం తెలంగాణ భాషా సంస్కృతిశాఖ వారి ప్రశంసలు పొందింది. సామాజిక స్పృహను కలిగించడంతోపాటు కుటుంబాల్లో కలహాలకు కారణమయ్యే అంశాలు, వాటివల్ల ఏ మేర కుటుంబాలు నష్టపోతున్నాయో కళ్లకు కట్టారని హరికృష్ణ అన్నారు. భాషాసంస్కృతిశాఖ ఆధ్వర్యంలో దర్శకుడు, యూనిట్‌ బృందాన్ని సత్కరించారు. కుమార్‌పటేల్, గోలి తిరుపతి, గురుమూర్తి, నర్సింహాచారి, అర్కుటి రామస్వామి, గాండ్ల సదయ్య, బుచ్చన్న, శైనికళ్యాణ్, ఆకెన భాస్కర్‌లున్నారు.

శ్రీవారి ఆలయ నిర్మాణానికి శ్రీకారం

- 31న ఉదయం 7:26 గంటలకు భూమిపూజ.. శ్రీవేంకటేశ్వరస్వామివారి కల్యాణం
- ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డికి సీఎం కేసీఆర్ విజ్ఞప్తి
- సమ్మతించిన టీటీడీ బోర్డు
- కరీంనగర్‌లోని పద్మనగర్‌లో పదెకరాలు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- రూ.20 కోట్లతో ఆలయ నిర్మాణం చేపట్టనున్న టీటీడీ



ఇటీవల పద్మనగర్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి కమలాకర్

విద్యానగర్(కరీంనగర్): అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీవేంకటేశ్వరస్వామి నిత్య పూజా ప్రియుడు. తిరుమల తిరుపతి దేవస్థానంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య దేవదేవునికి నిర్వహించే అనిర్వచనీయమైన నిత్య కైంకర్య వైభోగాన్ని కరీంనగర్‌లో జిల్లావాసులతోపాటు ఉత్తర తెలంగాణ భక్తులు త్వరలోనే ప్రత్యక్షంగా వీక్షించనున్నారు.

2018 నుంచి కరీంనగర్‌లో బ్రహ్మోత్సవాలు..

కరీంనగర్‌లోని మార్కెట్ రోడ్‌లో గల శ్రీవేంకటేశ్వ రాలయానికి 150 సంవత్సరాల చరిత్ర ఉంది. ఈ ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ 2018లో శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది జనవరి 27 నుంచి ఫిబ్రవరి 2 వరకు ఆరుసార్లు ఉత్సవాలు నిర్వహించారు.

శ్రీవారి ఆలయ నిర్మాణానికి టీటీడీ సమ్మతి..

కరీంనగర్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణ విషయమై మంత్రి కమలాకర్ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఏపీ సీఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డితో మాట్లాడారు. కరీంనగర్‌లో తిరుమలేశుని ఆలయం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి, టీటీడీ బోర్డుకు ఆదేశాలిచ్చారు. ఫలితంగా టీటీడీ బోర్డు కరీంనగర్‌లో ఆలయ నిర్మాణానికి సమ్మతించింది.

పశుసంవర్ధక శాఖ స్థలం కేటాయింపు

వెంకన్న ఆలయ నిర్మాణానికి మార్చి 15, 2022న కరీంనగర్‌లోని పద్మనగర్‌లో గల పశుసంవర్ధక శాఖకు సంబంధించిన పదెకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. సంబంధిత పత్రాలను సీఎం కేసీఆర్ అసెంబ్లీలోని ఆయన చాంబర్‌లో మంత్రి గంగుల కమలాకర్, టీటీడీ హైదరాబాద్ లోకల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ జీవీ భాస్కర్‌రావులకు అందజేశారు. వీరు మార్చి 30న కలెక్టర్ కర్ణన్, మేయర్ సునీల్‌రావు, స్తపతి రవికాంత్‌లతో కలిసి, ఆ స్థలాన్ని పరిశీలించారు. ల్యాండ్ సర్వే సహాయ సంచాలకుడు అశోక్, సర్వేయర్లు కొలతలు తీశారు.

వెంకటాచల ఆలయ సందర్శన

అమరావతిలో నిర్మాణంలో ఉన్న వెంకటాచల టీటీడీ ఆలయాన్ని మే 28, 2022న మంత్రి కమలాకర్ తన బృందంతో కలిసి సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. మరుసటి రోజు టీటీడీ ప్రధాన స్తపతి మునిస్వామిరెడ్డి, సహాయ స్తపతి కృష్ణారావు, యాదాద్రికి పని చేసిన ఆనంద్‌సాయి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌లతో కలిసి కరీంనగర్‌లో కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు.

అనుమతి పత్రాలిచ్చిన టీటీడీ చైర్మన్

ఈ నెల 15న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కరీంనగర్‌లో ఆలయ నిర్మాణ అనుమతి పత్రాలను మంత్రికి హైదరాబాద్‌లో అందజేశారు. రూ.20 కోట్లతో ఆలయ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ నెల 31న ఉదయం 7:26 గంటలకు వేదమంత్రోచ్ఛరణల మధ్య భూమిపూజ, అదేరోజు సాయంత్రం శ్రీవారి కల్యాణం నిర్వహించనున్నారు.

ఆగమశాస్త్రం ప్రకారం నిర్మిస్తాం



త్వరలో తిరుమల వెళ్తాం. వేంకటేశ్వర స్వామి అంత రాలయం, గోపురాలు, బాహ్యాలయ నిర్మాణాల నమూనాలతోపాటు మూల విరాట్టు, పోటు, ప్రసాద వితరణ కేంద్రాలను పరిశీలిస్తాం. ఆగమశాస్త్రం ప్రకారం కరీంనగర్‌లో శ్రీవారి ఆలయం నిర్మించి, రాష్ట్ర ప్రజలకు ఆ దేవదేవుని దర్శన భాగ్యం కల్పిస్తాం. – గంగుల కమలాకర్, రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి

దగ్గరలో స్వామివారి దర్శనం



దూరభారం తోపాటు ఆర్థికంగా ఇబ్బంది పడుతూ తిరుమల వెళ్లలేని వారికి దగ్గరలో వేంకటేశ్వర స్వామివారి దర్శన అవకాశం లభించనుంది. కరీంనగర్‌లో ఆలయ నిర్మాణం వల్ల వృద్ధులు, దివ్యాంగులకు ప్రయాణ బాధలు తప్పుతాయి. వారికి స్వామివారి దర్శన భాగ్యం కలుగుతుంది. – గోగుల ప్రసాద్, కరీంనగర్‌లో శ్రీవారి బ్రహ్మోత్సవాల నిర్వహణ కమిటీ బాధ్యుడు

కొనుగోలు కేంద్రాల్లోనే మక్కలు అమ్మాలి



కొనుగోళ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్: రైతులు పండించిన పంటలను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు పండించిన మక్కలు దళారుల పాలుచేయకుండా నేరుగా ప్రభుత్వకొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసిన వెంటనే నగదును రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తుందన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, త్వరలో నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తుందన్నారు. రైస్ మిల్లర్లు క్వింటాలుకు రెండు నుంచి మూడు కిలోలు తరుగు తీస్తున్నారని కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీచేశామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బుర్ర మౌనిక, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, రైతు సమన్వయ కమిటీ మండల అధ్యక్షుడు బోయిని రాయమల్లు, ఏఎంసీ వైస్‌చైర్మన్ మహిపాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు పురం ప్రేంచందర్‌రావు, మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ డైరెక్టర్ కుమార్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

గీత కార్మికులకు బీమా భరోసా

- జిల్లావ్యాప్తంగా 191 సొసైటీలు
- మొత్తం కార్మికులు 8,028
- తాటి, ఈతచెట్లు ఎక్కి ప్రాణాలు కోల్పోయినవారికి సహాయం



సుల్తానాబాద్/ఎలిగేడు: రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు బీమా పథకం ప్రవేశపెట్టడానికి శ్రీకారం చుట్టింది. గతంలో చాలా ఏళ్లుగా కార్యాలయాలు, నాయకుల ఇళ్లచుట్టూ తిరిగి ఎంతో కొంత ముట్టచెప్పందే చెక్కు చేతికందేది కాదు. ఈక్రమంలో గీతకార్మికుల ఇబ్బందులు తొలగించేందుకు సీఎం కేసీఆర్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. దీంతో గీత కార్మికులు తాటి, ఈతచెట్లు ఎక్కి ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందితే వారి కుటుంబాలకు అండగా నిలిచేందుకు రైతుబీమా తరహాలో 15 రోజుల్లో నేరుగా వారి ఖాతాల్లో జమ చేసేలా గీత బీమా పథకాన్ని ఇటీవల ప్రవేశపెట్టారు.

జిల్లా వ్యాప్తంగా..

జిల్లా వ్యాప్తంగా 266 జీపీలు, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపల్‌తో పాటు గోదావరిఖని కార్పొరేషన్ పరిధిలో గీత కార్మికులు తమ వృత్తిని కొనసాగిస్తున్నారు. జిల్లాలో 191 కల్లుగీత సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో 8,028 మంది గీత కార్మికులుగా అర్హులను అధికారులు గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే గీతకార్మికుల కోసం నెల నెలా చెల్లించాల్సిన పన్నులు రద్దుచేసిన విషయం తెలిసిందే. వాటితోపాటు ఎక్సైజ్ అధికారుల వేధింపుల నుంచి వీరికి మినహాయింపు లభించింది.

ఇవి తప్పనిసరి..

తాటి, ఈతచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందితే స్థానికంగా సర్పంచ్, సొసైటీ అధ్యక్షుడు వారి లెటర్ ప్యాడ్‌పై అధికారికంగా రాసి ఇవ్వాలి. వాటితో పాటు ఎఫ్ఐఆర్ కాపీ, డెత్ సర్టిఫికెట్, ఎక్సైజ్ అధికారుల గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు జత చేయాల్సి ఉంటుంది.

50 ఏళ్లు పైబడినవారికి ఆసరా..

50 ఏళ్లు పైబడిన గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పెన్షన్లను అందిస్తోంది. ఇటీవల సబ్సిడీలో వాహనాలను అందించేందుకు గీత కార్మికుల నుంచి వివరాలు సేకరించింది. తాటి, ఈత చెట్ల పైనుంచి పడి గాయపడినవారికి వెంటనే తాత్కాలిక సాయంగా రూ.10వేల నుంచి రూ.25వేల వరకు కార్పొరేషన్ ద్వారా అందిస్తున్నారు.

బాధిత కుటుంబాలకు భరోసా



గీత కార్మికుల బతుకులకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించింది. ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబానికి బీమా పథకం ద్వారా అండగా నిలిచేందుకు ముందుకు వచ్చింది.

– శ్రీనివాస్‌గౌడ్, గీతకార్మికుడు, దూళికట్ట

అండగా ప్రభుత్వం



గీత కార్మికుల కుటుంబానికి సీఎం కేసీఆర్ అండగా నిలిచారు. అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇప్పటికే ఈ వృత్తిని వదిలేసి బతుకుదెరువుకు దూరం వెళ్లిపోయారు. కొంతమంది ఈ వృత్తిలో కొనసాగుతున్నారు. గీత వృత్తిని కాపాడేందుకు ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేస్తోంది.

– బుర్ర శ్రీనివాస్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్, పూసాల

రండి ..ఓటరుగా నమోదు చేసుకోండి

సుల్తానాబాద్: రండి.. ఓటరుగా నమోదు చేసుకోండి. ఈ ఏడాది సాధారణ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునే యువతీ, యువకులు, విద్యావంతులు తమ నియోజకవర్గాల నుంచి ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. అర్హులు ఓటుహక్కు వినియోగించుకునేందుకు వీలుగా కేంద్ర ఎన్నికల సంఘం ఏడాదికి నాలుగుసార్లు ఓటరు నమోదు ప్రక్రియ చేపడుతోంది. ఈ ఏడాది జనవరి 1నుంచి సెప్టెంబరు 30 వరకు 18 ఏళ్లు నిండేవారికి డిసెంబర్‌లో నిర్వహించే ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వినియోగించుకోవడం పౌరుల బాధ్యతని, జిల్లా ఎన్నికల కార్యాలయాలు, ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు.

మార్గదర్శకాలు ఇలా...

గతంలో ఏటా జనవరి ఒకటో తేదీకి 18ఏళ్లు నిండిన వారు మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకునేవారు. వీరి దరఖాస్తులను జిల్లా ఎన్నికల అధికారులు పరిశీలించి అర్హులైనవారికి ఓటరు గుర్తింపుకార్డులు జారీ చేసేవారు. జనవరి 2కు 18 ఏళ్లు నిండినా వచ్చే ఏడాది వరకు ఆగాల్సిందే. నిరంతర నమోదు ప్రక్రియలో వీరికి ఓటరుకార్డు వచ్చినా.. ఆ ఏడాది ఎన్నికలు వస్తే ఓటువేసే వీలుండేది కాదు. కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా చేపట్టిన సర్వేల ప్రకారం జనవరి, ఏప్రిల్, జులై అక్టోబర్ నెలల్లో ఓటరు జాబితాలను జిల్లా అధికారులు పరిశీలించి వారికి ఓటుహక్కు కల్పిస్తారు. తర్వాతి నెలల్లో ఎన్నికలు వచ్చినా ఓటువేసే అవకాశం లభించనుంది.

సభకు అనుమతి నిరాకరించడం అన్యాయం

- సీపీఐ(ఎంఎల్) రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు చలపతిరావు



మాట్లాడుతున్న చలపతిరావు

గోదావరిఖని/పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలో పౌరహక్కుల సంఘం తలపెట్టిన బహిరంగసభకు పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ(ఎంఎల్) రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు జేవీ చలపతిరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టుల ఏరివేత పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదివాసులపై జరిపిన వైమానిక దాడులకు నిరసనగా, ఆదివాసీ పోరాటాలకు మద్దతుగా కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న ఫాసిస్టు విధానాలకు నిరసనగా బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఒక్కరూ గమనిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం సరైంది కాదన్నారు. ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, విప్లవ అభిమానులు, విప్లవ ప్రజానీకం, కేసీఆర్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి కె.రాజన్న, ఐ.కృష్ణ, ఎ.వెంకన్న, ఈదునూరి నరేశ్, భూమేశ్వర్, చిలుక శంకర్, ఎ.రాములు, బి.అశోక్, పాల్గొన్నారు.

హాల్‌మీటింగ్‌లకు అనుమతివ్వాలి...

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం పౌరహక్కుల సంఘ నాయకులు తలపెట్టిన హాల్‌మీటింగ్‌కు అనుమతి ఇవ్వకపోవడం అప్రజాస్వామికమని టీపీఎఫ్ జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య, కోకన్వీనర్ గాండ్ల మల్లేశం, దళిత లిబరేషన్‌ఫ్రంట్ ప్రధానకార్యదర్శి మార్వాడి సుదర్శన్ అన్నారు. పెద్దపల్లి పోలీసుల తీరును ఖండించారు. ఇకనైనా హాల్‌మీటింగ్‌లకు అనుమతి ఇవ్వాలన్నారు.

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ సూచించారు. ఆదివారం జీఎం కార్యాలయంలో సమీక్షా సమావేశంలో మాట్లాడారు. స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలన్నారు. అన్నిగనులు, డిపార్ట్‌మెంట్‌లకు చెందిన ఉన్నతాధికారులు వారికి నిర్దేశించిన పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, తెలంగాణ వంటకాలతో కూడిన స్టాళ్లను ఏర్పాటుచేయాలన్నారు. ఉదయం తెలంగాణ రన్ నిర్వహించి తెలంగాణా తల్లికి పూలమాల వేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో అధికారులు రాంమోహన్, రాంమూర్తి, రామకృష్ణ, లక్ష్మినారాయణ నవీన్, మదన్‌మోహన్, అంజనేయులు, అభిలాశ్, బాలసుబ్రహ్మణ్యం, వీరారెడ్డి పాల్గొన్నారు.

శ్రీఅయ్యప్పస్వామి విగ్రహ పునః ప్రతిష్ఠాపనోత్సవాలు



వేడుకలకు ముస్తాభవుతున్న అయ్యప్ప స్వామి ఆలయం

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో పంచలోహ విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవ వేడుకలకు శ్రీఅయ్యప్ప స్వామి ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబుచేశారు. కేరళకు చెందిన శ్రీ సంజీవ్ నంబూద్రి గురుస్వామి బృందం, అయ్యప్పస్వామి ఆలయ ప్రధాన గురుస్వామి శ్రీ సారంగా చారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హోమాలు ప్రత్యేక పూజల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. రూ.25 లక్షల ఖర్చుతో పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపనకు ప్రత్యేక ఏర్పాట్లుచేస్తున్నారు. పూజల్లో పాల్గొనే భక్తులు ముందుగా ఆలయంలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.


పాత పెన్షన్ విధానం కొనసాగించాలి



కొవ్వొత్తుల నిరసనలో మజ్దూర్ యూనియన్

రామగుండం: ఆలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్, దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ పిలుపుతో ఆదివారం రాత్రి రామగుండం రైల్వేస్టేషన్ ఎదుట పాతపెన్షన్ విధానం కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ రామగుండం బ్రాంచ్ ప్రతినిధులు ఓవై.స్వామి, మెట్ట రామారావు, రాథోడ్ ఆనంద్, మోజేస్, అరవింద్, వలీహైదర్, రమేశ్ తదితరులున్నారు.

చెక్‌డ్యాంలో పడి యువకుడి మృతి



సదాశివరెడ్డి (ఫైల్)

ఓదెల: మండలంలోని పొత్కపల్లి మానేరు చెక్‌డ్యాంలో పింగిళి సదాశివరెడ్డి(24) యువకుడు ఈతకు వెళ్లి ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. పొత్కపల్లి ఎస్సై రామకృష్ణ కథనం ప్రకారం.. టేకుమట్ల మండలం ఎల్లంపల్లికి చెందిన సదాశివరెడ్డి ఓదెల మండలం జీలకుంట గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఆదివారం సాయంత్రం బంధువులతో చెక్‌డ్యాం వద్ద ఫొటోలు దిగుతామని చెప్పి స్నానంచేసేందుకు చెక్‌డ్యాంలోకి దిగాడు. ఈత రాకపోవడంతో సదాశివరెడ్డి నీటిలో మునిగి మృతిచెందాడు. మృతుడి తండ్రి పింగిళి దేవేందర్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐక్య ఉద్యమాలకు కార్మికులు సిద్ధంకావాలి

- సీఐటీయూ నాయకులు సాయిబాబు



బహిరంగసభలో మాట్లాడుతున్న సాయిబాబు

గోదావరిఖని: కార్మిక హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ అఖిలభారత కోశాధికారి ఎం.సాయిబాబు అన్నారు. ఆదివారం స్థానిక ప్రధాన చౌరస్తావద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగసంస్థలను కారుచౌకగా అమ్మేస్తోందన్నారు. నష్టాల్లో ఉన్న సంస్థలను మూసి వేసి, లాభాలు వచ్చే సంస్థలను ప్రైవేటీకరిస్తోందన్నారు. దీనికి నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ పేరు తో బొగ్గు పరిశ్రమల్లో కేంద్ర ప్రభుత్వ వాటాలను అమ్మేందుకు యత్నిస్తోందన్నారు. డీపీఈ గైడ్‌లైన్స్ పేరుతో 11వ వేతన ఒప్పందం రెండేళ్లు ఆలస్యమైందన్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.రాజారావు మాట్లాడుతూ.. 1973లో జాతీయకరణ చట్టం ద్వారా ప్రైవేట్ పరిశ్రమలన్నీ ప్రభుత్వ రంగ సంస్థలుగా మారాయన్నారు. 2017లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పెరగాల్సిన వేతన ఒప్పందం నేటికీ అమలుకాలేదన్నారు. అనేక పరిశ్రమల్లో వేతన ఒప్పందాల ఊసే లేదన్నారు. వేతన ఒప్పందం దేశంలోని బొగ్గుగని కార్మికుల విజయం అన్నారు. సమావేశంలో నాయకులు తుమ్మల రాజారెడ్డి, మంద నరసింహారావు, నాగరాజుగోపాల్, వై.యాకయ్య,వి.కుమారస్వామి, ఎ.ముత్యంరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్సీవర్గీకరణకు న్యాయపోరాటం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందునరేశ్



మాట్లాడుతున్న గోవింద్‌నరేశ్

పెద్దపల్లిరూరల్: అన్నిరంగాల్లో సముచిత స్థానం సంపాదించడానికే ఎస్సీ వర్గీకరణ సాధించడానికి పోరాటం చేస్తున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్‌నరేశ్ మాదిగ అన్నారు. పెద్దపల్లిలో ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పోరాటానికి యువత ముందుండాలన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగా సారథ్యంలో రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. నాయకులు రవికుమార్, సామ్యెల్, రాజేందర్, తాండ్ర శ్రీనివాస్, పల్లెబాబు, రాజయ్య, లింగయ్య, సుధాకర్, నరేశ్, అశోక్ తదితరులున్నారు.

రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న స్వామి వివేక్‌పటేల్

సుల్తానాబాద్: ఏపీ బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్‌ను మున్నూరుకాపు యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామి వివేక్‌పటేల్ కలిసి ఘనంగా సన్మానించారు. ఆదివారం గుంటూరు జిల్లా మంగళగిరిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆహ్వానాన్ని అందుకొని వెళ్లారు. కాపులంతా బీఆర్ఎస్ వెంటే నడవాలని పిలుపునిచ్చారు.

నకిలీ విత్తనాల విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు



సుల్తానాబాద్‌లో ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న ఎస్సై వినీత

సుల్తానాబాద్: ఫర్టిలైజర్ షాపుల్లో నకిలీ విత్తనాలను యాజమాన్యం అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎస్సై వినీత హెచ్చరించారు. మండలకేంద్రాల్లో ఫర్టిలైజర్‌షాపులను ఆదివారం ఎస్సై తనిఖీచేసి మాట్లాడారు. వర్షాకాలం సీజన్ ముందే రైతులను మోసం చేసేందుకు వ్యాపారులు సిద్ధంగా ఉంటారని, వాటిని అడ్డుకునేందుకు ఫర్టిలైజర్లు, సీడ్స్ షాపులను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే షాపు యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై తిరుపతిరావు ఉన్నారు.